# మత్స్యకారులకు అదనపు ఉపాధి

• డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

**ముత్తుకూరు(పొదలకూరు):** సీ వీడ్ (సముద్రపు నాచు మొక్కలు) కల్చర్ ద్వారా మత్స్యకారులకు అదనపు ఉపాధి లభిస్తుందని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. మండలంలోని కృష్ణపట్నం గ్రామ సాయిబాబా మందిరంలో మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ, మత్స్యశాఖలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 70 మంది మహిళా మత్స్యకారులకు సీ వీడ్ కల్చర్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సముద్రం వద్ద ఒక కి.మీ మేరకు కృష్ణపట్నం – నేలటూరు మధ్యలో నాచుమొక్కల పెంపకం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కల్చర్ వల్ల మత్స్యకార కుటుంబాలు అదనంగా ఆదాయం సంపాదించే అవకాశం ఉంటుందన్నారు. డీఆర్‌డీఏ ద్వారా మత్స్యకారులకు చేపలను ఎండ బెట్టుకునేందుకు సోలార్ డ్రయర్స్, చేపలను భద్రపరిచేందుకు ఐస్ ఫ్యాక్టరీలను మంజూరు చేస్తామన్నారు. ఇదే శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం కావాలిలో చేపడతామన్నారు. మత్స్యశాఖ ఏడీ చాన్‌భాషా మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద పథకంలో భాగంగా సీ వీడ్ కల్చర్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మత్స్యకారులు సొసైటీలను ఏర్పాటు చేసుకుంటే కేంద్రం నుంచి నిధులు మంజూరవుతాయన్నారు. 35 మంది మహిళలు సొసైటీ ఏర్పాటు చేసుకుంటే రూ.90 వేలు, ఆపైన సభ్యులతో ఏర్పాటు చేస్తే రూ.5 లక్షల వరకు మంజూరు చేస్తారన్నారు. సముద్రపు నాచు మొక్కల పెంపకం వల్ల మత్స్య సంపద బాగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఎఫ్‌డీఓ పూజిత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

# చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

**ముత్తుకూరు(పొదలకూరు):** ముత్తుకూరు మండలం పిడతాపోలూరు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో జిల్లాలోని ఎంపీడీఓలు, ఇతర అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు తెలిపారు. కేంద్రం వద్ద సీఈఓ, డీపీఓ శ్రీధర్‌రెడ్డితో కలిసి మంగళవారం మాట్లాడారు. ప్రతి గ్రామంలో చెత్తను సేకరించాల్సిందిగా ఆదేశాలు ఉన్నాయన్నారు. పిడతాపోలూరు పంచాయతీని మోడల్‌గా తీసుకుని శిక్షణకు తీసుకొచ్చామన్నారు. పంచాయతీల్లో చెత్తను సేకరించకుంటే ఆయా గ్రామస్తులు ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉందన్నారు. ఇందుకు సంబంధించి ఐవీఆర్ కాల్స్ కూడా చేయడం జరుగుతుందన్నారు. నేరుగా పంచాయతీరాజ్ కమిషన్ కార్యాలయం నుంచి చెత్త సేకరణపై వివరాలు సేకరిస్తారన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓలు పాల్గొన్నారు.


గ్రీన్ అంబాసిడర్ల గ్లౌజులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

# గ్రామాల్లో పొలం పిలుస్తోంది

**మనుబోలు:** మండలంలోని గురివిందపూడి, కొమ్మలపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఎరువులు, నీటి యాజమాన్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు ఎస్‌కే ఇర్షాద్, శిరీష పాల్గొన్నారు.

**విడవలూరు:** వరిని సాగు చేస్తున్న రైతులు పంట నమోదు చేసుకోవాలని ఏఓ లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని ఊటుకూరు, ముదివర్తిలో గల రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగలను 50 శాతం రాయితీపై అందిస్తున్నామని, అవసరమైన వారు స్థానిక రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. అనంతరం పొలాలను పరిశీలించారు. వీఏఏలు భువన, ప్రత్యూష, వెన్నెల, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**కోవూరు:** తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత పేర్కొన్నారు. మండలంలోని పాటూరు, గుమ్మళ్ల దిబ్బలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి రజని, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రభ, చందన తదితరులు పాల్గొన్నారు.

**ఇందుకూరుపేట:** మండలంలోని కొమరికలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి, వీఏఏ నరహరి తదితరులు పాల్గొన్నారు.


మనుబోలు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ


విడవలూరులో..


కోవూరులో..


ఇందుకూరుపేట: కొమరికలో..

# అన్నదాన కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

**పొదలకూరు:** శబరిమల అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో మాలధారణ సమయంలో వీలైనన్ని అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నట్టు సేవా సమాజం స్టేట్ జనరల్ సెక్రటరీ మేకల వెంకయ్య అన్నారు. పొదలకూరులో ఆయన మంగళవారం మాట్లాడుతూ దీక్ష 48 రోజులు చేపట్టాలన్నారు. శబరిమల అయ్యప్ప సేవా సమాజం సేవలను రెండు తెలుగు రాష్ట్రాల స్వాములు సీజన్లో సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బి.రాజా, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ చొప్పా వెంకటేశ్వర్లు, మండలాధ్యక్షుడు అడపాల మస్తాన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్య

# యాప్‌లో హాజరు నమోదు తప్పనిసరి

**కోవూరు:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు రెండు పూటలా హాజరును యాప్ ద్వారా నమోదు చేయాలని డ్వామా ఏపీడీ మృదుల సూచించారు. కోవూరు డ్వామా సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. డ్వామా ఏపీడీ శంకరనారాయణ, టీఓటీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మృదుల

# అక్రమ కేసులతో ఉద్యమాన్ని ఆపలేరు

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** గిరిజనుల భూముల కోసం ఉద్యమాలు చేస్తున్న వారిని అక్రమంగా అరెస్ట్ చేయగా, వారి కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన రైతు సంఘ నేతలపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడం దారుణమని, ఇలాంటి చర్యలతో ఉద్యమాలను ఆపలేరని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. కరేడులో ఎలాగైనా భూసేకరణను చేపట్టాలనే ఉద్దేశంతో గిరిజనులు, రైతులపై అక్రమ కేసులను స్థానిక టీడీపీ ఎమ్మెల్యే పెట్టించారని ఆరోపించారు. పరామర్శించేందుకు కరేడుకు వెళ్లిన రైతు కూలీ, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శులు వెంగయ్య, పుల్లయ్యను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఈ వ్యవహారంలో ఎస్పీ, కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు. నేతలు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

## డీఎల్ఎన్నార్ పాఠశాలలో తనిఖీ

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** పట్టణంలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాలను నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని సిబ్బందికి సూచించారు. మెనూను కచ్చితంగా అమలు చేయాలని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**కోవూరు:** డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలని ఎస్సై రంగనాథ్‌గౌడ్ పేర్కొన్నారు. డ్రగ్స్‌తో సంభవించే అనర్థాలపై అవగాహన సదస్సును పడుగుపాడులోని నేతాజీనగర్‌లో గల వైకేఆర్ అండ్ కే డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న, వైస్ ప్రిన్సిపల్ రామ్‌ప్రసాద్, ఎన్నెస్సెస్ కోఆర్డినేటర్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు నెక్లెస్ మాయంపై కేసు నమోదు

**నెల్లూరు(క్రైమ్):** బీరువాలోని బంగారు నెక్లెస్ మాయమైన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉంటున్న సునీల్‌కుమారి ఇంట్లో అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఏడు నెలలుగా పనిచేస్తూ ఇటీవల అకస్మాత్తుగా మానేశారు. ఈ తరుణంలో బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను గత నెల 27న సునీల్‌కుమారి చూడగా, అందులో ఉన్న 13 గ్రాముల నెక్లెస్ కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఇంట్లో పనిచేస్తూ మానేసిన మహిళపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

**నెల్లూరు(బారకాసు):** ఎల్ఆర్ఎస్ పథకాన్ని నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార లేఅవుట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ స్రవంతి కోరారు. నక్ష సర్వే, అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ అంశాలపై ప్రజాప్రతినిధులు, ఎల్టీపీలు, బిల్డర్లకు అవగాహన సదస్సును కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్ ప్లానింగ్ విభాగ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తాజా ఉత్తర్వుల మేరకు ఈ ఏడాది జూన్ 30 వరకు రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం ఉందని వివరించారు. నక్ష సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు చాట్ల నరసింహరావు, జమీర్, కార్పొరేటర్లు కర్తం ప్రతాప్‌రెడ్డి, పొట్లూరి రామకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, నేతలు గణేశం వెంకటేశ్వర్లు, శ్రీధర్, ఏసీపీ మురళి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు ఉద్యమం

**నెల్లూరు (టౌన్):** ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని, లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణను చేపడతామని ఫ్యాప్టో నేతలు స్పష్టం చేశారు. అన్నమయ్య సర్కిల్లోని యూటీఎఫ్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఫ్యాప్టో చైర్మన్ మధుసూదనన్‌వు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ ఐక్య సంఘాల ఐక్య వేదిక ద్వారా ఉద్యమ కార్యాచరణను ప్రకటించి.. ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. వివిధ సంఘాల నేతలు రమేష్, నవకోటేశ్వరరావు, మురళీకృష్ణ, ప్రసాద్, నరసింహులు, హజరత్ పిచ్చిబాబు, శ్రీనివాసరావు, మురళీధర్‌రావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.



## క్లుప్తంగా

### పూర్వ విద్యార్థుల దాతృత్వం



**కొడవలూరు:** మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ హైస్కూల్లో గల నలుగురు విద్యార్థినులకు సైకిళ్లను పాఠశాలకు చెందిన పలువురు పూర్వ విద్యార్థులు సమకూర్చారు. వీటిని పూర్వ విద్యార్థి కట్టా ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. హెచ్ఎం మోహన రామలింగయ్య, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

### బెజవాడ గోపాల్‌రెడ్డికి నివాళి



**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** సమాజహితాన్ని కోరుకునే ప్రతి ఒక్కరికీ బెజవాడ గోపాల్‌రెడ్డి జీవితం ఆదర్శనీయమని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ పేర్కొన్నారు. గోపాల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి మంగళవారం నివాళులర్పించారు. కమిషనర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### వీరాంజనేయస్వామికి పూజలు



**పొదలకూరు:** పట్టణంలోని మారుతి నగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అత్యంత వైభవంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముదిరాజ్ సేవా సంఘం ఉభయకర్తగా వ్యవహరించింది. ఉదయం దేవస్థానంలో అభిషేకాలు, ఆకుపూజ, అష్టోత్తర పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ జరిగింది.

### విశ్వనాథునికి ప్రత్యేకాలంకరణ



**మనుబోలు:** మండలంలోని మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథ స్వామి ఆలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామికి అభిషేకం నిర్వహించారు. అనంతరం కందల సుస్మిత నాట్య ప్రదర్శన జరిగింది.

### జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి


డీటీకి వినతిపత్రమిస్తున్న జర్నలిస్టులు

**కోవూరు:** తమ సమస్యలను పరిష్కరించాలని జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావుకు వినతిపత్రాన్ని ఏపీయూడబ్ల్యూజే నేతలు మంగళవారం అందజేశారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి నయీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

**వెంకటాచలం:** మండలంలోని సరస్వతి నగర్ వద్దనున్న అక్షర విద్యాలయంలో మంగళవారం సీబీఎస్‌ఈ క్లస్టర్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈనెల 10 తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొననున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేంద్రరెడ్డి, అక్షర విద్యాలయం ప్రిన్సిపల్ కుముద తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లతో తీవ్ర నష్టాలు

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో వినియోగదారులకు తీవ్ర నష్టాలు ఎదురవుతాయని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పరిధిలోని సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. అనంతరం ఏఈకి వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం నేతలు వెంకమరాజు, గండవరపు శ్రీనివాసులు, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

➡ **మనుబోలు:** స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వినియోగదారుల జేబులకు చిల్లు పడటం ఖాయమని సీఐటీయూ నాయకుడు దేవదానం అన్నారు. మంగళవారం మనుబోలు మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు.


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వినతిపత్రమిస్తున్న నేతలు


మనుబోలులో..

# బిడ్డకు ముర్రుపాలు పట్టించాలి

**కొడవలూరు:** బిడ్డకు ముర్రుపాలను విధిగా పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల సూచించారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని వెంకన్నపురంలో తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం సీమంతాలను జరిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు స్వర్ణలత, రమణమ్మ, జయశ్రీ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

➡ మండలంలోని పెయ్యలపాళెం అరుంధతీయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు చెంచమ్మ, కృష్ణవేణి, హెల్పర్ ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

➡ **విడవలూరు:** మండలంలోని గాదెలదిన్నెలో గల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. అనంతరం పౌష్టికాహార పదార్థాలను అందజేశారు. వావిళ్ల సెక్టార్ సూపర్‌వైజర్ కోటేశ్వరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, శైలజ, భారతి, జయశ్రీ, వాణి, శిరీష, చాందిని, ప్రసన్న, పాఠశాల సిబ్బంది శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: తల్లి పాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల పేర్కొన్నారు. మైపాడు పంచాయతీ పరిధిలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీని జరిపారు.

➡ **మనుబోలు:** తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ అన్నారు. మండలంలోని మనుబోలు దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీసం సంవత్సరం పాటైనా బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. అంగన్‌వాడీల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు విజయమ్మ, నిర్మల, సుజన తదితరులున్నారు.

➡ **పొదలకూరు:** మండలంలోని ప్రభగిరిపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సూపర్‌వైజర్ ధన్యాని పద్మజ వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు చెన్నమ్మ, లక్ష్మీనర్సమ్మ, పెంచలమ్మ, జయంతి, ఆయా పుష్ప పాల్గొన్నారు. నేదురుమల్లిలో సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నాగలక్ష్మీకుమారి, నర్మద, విమలాకుమారి, సుమ, ప్రసన్న, పెంచలమ్మ పాల్గొన్నారు.

➡ ముత్తుకూరు మండలంలోని బేసిన్ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ అమ్మణమ్మ వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలను చేశారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, విజయకుమారి, శ్రావణి, సుభాషిణి పాల్గొన్నారు.


కొడవలూరు: పెయ్యలపాళెంలో..


కొడవలూరు: వెంకన్నపురంలో సీమంతాలు


మనుబోలులో..


విడవలూరు: గాదెలదిన్నెలో..


ఇందుకూరుపేట: మైపాడులో..

# చేప దొరికితే ఒట్టు

• ఆవేదనలో మత్స్యకారులు

**తోటపల్లిగూడూరు:** మండలంలోని తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారులకు చేపలు లభ్యం కావడం లేదు. దీంతో ఉపాధి కరువై ఆకలితో అలమటిస్తున్నారు. కోడూరు పంచాయతీలోని 8 మత్స్యకార గ్రామాలతోపాటు వెంకన్నపాళెం పట్టపుపాళెంలోని సుమారు 3,600 కుటుంబాలు వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. కొంత కాలంగా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో సముద్రంలోని మత్స్య సంపద దరికి చేరడం లేదు. దీంతో ఇప్పటి వరకు అంతంతమాత్రంగా సాగుతున్న వేట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. తీరంలో అలలు ఎగసి పడుతున్నాయి. అప్పుడప్పుడూ అల్పపీడనాలతో పాటు పోటు కారణంగా సముద్రం ఉగ్రరూపంగా మారుతోంది. దీంతో వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు భయపడుతున్నారు. ధైర్యం చేసి వేటకు వెళ్లినా మత్స్య సంపద దొరక్క ఒట్టి పడవలతో తిరిగి రావాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. మత్స్యకారులు తమ వేట సామగ్రి, పడవులు, వలలను తీరంలో ఉంచి ఇతర పనులను చూసుకుంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.


కోడూరు తీరంలో పడవలు

# హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

**వెంకటాచలం:** వెంకటాచలం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న 16 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు ఈనెల 26 తేదీలోగా వెంకటాచలం ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వెంకటాచలం మండలంలో నిడిగుంటపాళెం (ఎస్సీ), దర్బలమిట్ట, మొలకలపూడి, పూడిపర్తి, కసుమూరు – 2, ఇస్లాంపేట, కంటేపల్లి (జీసీ), మల్లుగుంటసంఘం, పొదలకూరు మండలంలో మహమ్మదాపురం (ఎస్టీ), కల్యాణపురం, పొదలకూరు ఎస్సీకాలనీ, ప్రభగిరిపట్నం, మరుపూరు, మనుబోలు మండలంలో వీరంపల్లి – 2, బద్దెవోలు న్యూ, కొమ్మలపూడి (ఎస్టీ) కేంద్రాల్లో ఖాళీలు ఉన్నాయని తెలియజేశారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 2025 జూలై ఒకటో తేదీ నాటికి 21 సంవత్సరాల వయసు నిండి, 35 సంవత్సరాలు లోపు వివాహిత మహిళలు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు వెంకటాచలం ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

➡ **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు కోరారు. అంగన్‌వాడీ కార్యకర్త ఒకటి, సహాయకుల పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయని, అర్హులు సచివాలయ పరిధిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

➡ **ఇందుకూరుపేట:** ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మండలాల్లో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, 11 హెల్పర్ల పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అదనపు సీడీపీఓ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. వివరాలకు అంగన్‌వాడీ లేదా సీడీపీఓ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

➡ **కొడవలూరు:** మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల పేర్కొన్నారు. పెమ్మారెడ్డిపాళెంలో కార్యకర్త (ఓసీ), బసవాయపాళెం – 1, రామాపురం – 2లో హెల్పర్ (బీసీ – డీ), పద్మనాభసత్రం, సంజీవనగర్‌లో హెల్పర్ (ఓసీ) ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆసక్తి గల వారు కోవూరు సీడీపీఓ కార్యాలయంలో ఈ నెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

➡ **కోవూరు:** కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఇన్‌చార్జి సీడీపీఓ ఉమా తెలిపారు. కోవూరు మండలంలో ఆయా పోస్టులు ఏడు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.